సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం | 23 | నవంబర్ | 2024



చివరిలో తెగుళ్ల దాడి

ఖరీఫ్ వరి పంట చివర దశకు వచ్చేసింది. వర్షాభావంతో చివరిలో నాటిన వరి పంటపై తెగుళ్లు, పురుగులు దాడిచేస్తున్నాయి. - 8లో



26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. - 8లో

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చరణ్

గుమ్మలక్ష్మీపురం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆరిక చరణ్ ఎంపికైనట్టు పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి 29 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చరణ్ పాల్గొంటాడని తెలిపారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జేసీ ఎస్.ఎస్.శోభిక



మాట్లాడుతున్న జేసీ శోభిక

పార్వతీపురం: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, బ్యాంకు గ్యారంటీ(బీజీ)లను తక్షణమే అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక రైస్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో రూ.168 కోట్ల మేర బీజీలు రావాల్సి ఉందని, ఆశించినంత స్థాయిలో అందలేదన్నారు. బీజీలు అందజేసిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపిస్తామని ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో 2లక్షల 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల న్నది లక్ష్యంగా వెల్లడించారు. సోమవారం నుంచి ధాన్యం సేకరణ జరుగుతుందని, ఈ లోగా మిల్లర్ల బీజీలు అందజేయాల్సిందేనని స్పష్టంచేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖా ధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అడవితల్లి విగ్రహం వద్ద గురువుల నిరసన



అడవితల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పార్వతీపురంటౌన్: సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట మూడో రోజు శుక్రవారం దీక్షలు కొనసాగించారు. అనంతరం అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సమస్యలు పరిష్కరించేలా పాలకుల మనసు మార్చాలని అడవి తల్లికి ప్రార్థన చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు వచ్చేలా దీవించాలని కోరారు. నిరసనకు గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, రాజు, అఖిల్, సురేష్, లోవరాజు, రామకృష్ణ, చంద్రశేఖర్, దుక్క సీతారాం తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం నాయకులు దివాకర్, రమేష్, వెంకట్, జగదీశ్, మురళి, తిరుపతిరావు, శ్రీను, జ్యోతి, ఉమా, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పార్వతీపురం: జిల్లాలోని కిశోర బాలికలను సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కోరారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ మందిరంలో కిశోర బాలికల వికాసంపై శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కిశోర బాలికలు ఆరోగ్యకరంగా ఉంటేనే రేపటి తరం, సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో రక్తహీనత, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, సికిల్‌సెల్ ఎనీమియా, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించి జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన వారు మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి, డీసీపీఓ సత్యనారాయణ, సెర్ప్, ఐసీడీఎస్, ఇంటర్మీడియట్ విద్య, వైద్య ఆరోగ్యం, పంచాయతీ రాజ్, ఇతర శాఖాల అధికారులు, సిబ్బంది, ఎన్జీఓలు పాల్గొన్నారు.





'భామిని మండల రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 5 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. చేతికి అందొచ్చిన పంటను తక్కువ ధరకు విక్రయించుకోలేక... కొనుగోలు కేంద్రం అందుబాటులో లేక.. ఇదిగో ఇలా ఇళ్లలోనే రైతులు దాచుకుంటున్నారు. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే నష్టం ఊహించడానికే భయమేస్తోందంటూ రైతులు వాపోతున్నారు. పత్తి కొనుగోళ్లు సాగడం లేదనేందుకు భామిని మండల కేంద్రంలో కనిపించిన ఈ చిత్రాలే సాక్ష్యం.
–సాక్షి, పార్వతీపురం మన్యం



పత్తి రైతుకు.. మద్దతు కరువు..!

- గిట్టుబాటుకాని పంట
- అందుబాటులో లేని కొనుగోలు కేంద్రం
- రామభద్రపురం తీసుకెళ్లలేక దళారులకే విక్రయం
- క్వింటా వద్ద రూ.1500 వరకు నష్టం



సాగులో ఉన్న పత్తి పంట

వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది దాదాపు 15 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగుచేశారు. రికార్డుల్లో నమోదు కాని పంట మరో 15 వేల ఎకరాల్లో ఉండొచ్చని అంచనా. గిరిజనులు పోడు పంటలు, వివిధ పండ్ల తోటల్లోనూ అధిక మొత్తంలో సాగులో ఉంది. ఇవేవీ లెక్కల్లోకి రావడం లేదు. కొన్నిచోట్ల కౌలుకు తీసుకుని రైతులు సాగుచేసిన పంట కూడా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మద్దతు ధర పొడుగు పింజ క్వింటాకు రూ.7,521, పొట్టి పింజకు రూ.7,121గా నిర్ణయించింది. పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల దళారులు సిండికేట్‌గా మారి, తమ ఇష్టానుసారంగా కొనుగోలు చేసి, రైతును దోచేస్తున్నారు. అప్పులు చేసిన సాగుకు దిగిన రైతు.. మద్దతు ధర రాకపోవడంతో క్వింటా వద్ద సుమారు రూ.1,500 వరకు నష్టపోతున్నాడు.

ఎకరాకు పెట్టుబడి రూ.25 వేలకుపైగానే...

జిల్లాలో భామిని, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పత్తి ఎక్కువగా సాగులో ఉంది. ఎకరా విస్తీర్ణంలో సుమారు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. నిరంతరం పంట సాగులో ఉండటం.. రసాయనిక ఎరువుల ప్రభావం వల్ల భూసారం తగ్గి ఆరేడు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. ఓవైపు దిగుబడి పడిపోవడం.. మరోవైపు ప్రభుత్వ ఇస్తున్న మద్దతు ధర దక్కకపోవడంతో పత్తి పండించిన రైతుకు నష్టాలే మిగులుతున్నాయి.

రామభద్రపురంలో కొనుగోలు కేంద్రం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఈ ఏడాది రామభద్రపురం మండలం ముచ్చెర్లవలస వద్ద ఉన్న ప్రతూ జిన్నింగ్ మిల్లు వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సుమారు 18 మండలాలకు ఈ కేంద్రమే ఆధారం. జిల్లాలోని పత్తి సాగు చేసే మండలాల్లో ఏ ప్రాంతం నుంచి వెళ్లాలన్నా.. వ్యయప్రయాసలే. ముఖ్యంగా భామిని పరిసర ప్రాంతాల నుంచి రావాలంటే.. దూరం 100 కిలోమీటర్లకుపైగానే పడుతుంది. అంత దూరం తీసుకుని వెళ్లడం.. తీరా అక్కడ తేమ ఉందన్న కారణంతో రెండేసి రోజులు ఆరబెట్టాల్సి రావడం వల్ల రైతు ఇబ్బందులు పడుతున్నాడు. పత్తి పంట తరలించడానికి అయ్యే రవాణా ఖర్చే రూ.12 వేలు వరకు అవుతోంది. రెండు క్వింటాళ్ల ధర ఇక్కడే పోతోంది. సాలూరు, భామినిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ.. ఆచరణలోకి రాలేదు. మరోవైపు నిబంధనలు గుదిబండగా మారుతున్నాయి. కనీస మద్దతు ధర రావాలంటే పత్తి గింజ పొడవు 29.50 మి.మీ నుంచి 30.50 మి.మీ వరకు ఉండాలి. మైక్రో నియర్ వ్యాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలి. తేమ శాతం 8 ఉంటేనే పూర్తి మద్దతు లభిస్తుంది. ఎనిమిది శాతం కంటే ఎక్కువ ఉంటే.. ప్రతి ఒక్క శాతానికీ రూ.75.21 పైసలు చొప్పున ధరలో కోత ఉంటోంది.

విక్రయించలేక.. దాచుకోలేక!

ప్రస్తుతం పండిన పంట చేతికి వస్తోంది. ఈ నేపథ్యంలో పంటను దాచుకోవడానికి స్థలం లేక, ఇళ్లలోనే పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పొరపాటున అగ్ని ప్రమాదాలు సంభవిస్తే పెద్ద నష్టమే చవిచూడాల్సి వస్తుంది. దీనికితోడు వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల వల్ల కూడా పత్తి నాణ్యత కోల్పోవాల్సి వస్తోంది. భామిని మండలంలో సుమారు 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల సదుపాయం ఉంది. దీనిని కూడా వినియోగించుకోలేని పరిస్థితి. రైతుల నిస్సహాయ స్థితిని చూసి దళారులు ప్రవేశిస్తున్నారు. రామభద్రపురంలోని జిన్నింగ్ మిల్లు యాజమాన్యమే తమ ఏజెంట్ల ద్వారా నేరుగా గ్రామాల్లోకి వెళ్లి రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తేమ, ధూళి, రాళ్లను సాకుగా చూపి క్వింటా రూ.6,100 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఈ లెక్కన రైతు క్వింటా దగ్గర రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు నష్టపోతున్నాడు.

ఇళ్లలో దాచుకోలేకపోతున్నాం..



చేతికొచ్చిన పంటను ఏం చేయాలో తెలియడం లేదు. ఇళ్లలోనే దాచుకోవాల్సి వస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగినా, వర్షం పడినా నష్టపోకతప్పదు. రామభద్రపురంలో కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలంటే చాలా కష్టం. అందుకే నష్టం వచ్చినా ప్రైవేట్ వర్తకులకే విక్రయిస్తున్నాం.
– బిడ్డిక విష్ణు, భామిని

సమీపంలో కొనుగోలు కేంద్రం తెరవాలి



మా ప్రాంతంలో పత్తి ఎక్కువగా సాగు చేశాం. పంట చేతికొచ్చింది. ఏంచేయాలో తెలియడం లేదు. విజయనగరం జిల్లాలోని రామభద్రపురం కేంద్రానికి మా ఊరి నుంచి వెళ్లాలంటే రవాణా ఖర్చులే తడిసిమోపెడవుతాయి. అసలే మద్దతు ధర దక్కడం లేదు. దీనికితోడు ఆ ఖర్చు అదనం. భామినిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నాం.
– గురుబిల్లి లక్ష్మీపతినాయుడు, భామిని

నిస్సహాయ స్థితిలో రైతులు



కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల రైతు నిస్సహాయ స్థితిలో దళారులు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి జిల్లాలో ఉంది. ఇప్పటికే పంట సాగుకు భారీగా అప్పులు చేశారు. ఇప్పుడు మద్దతు కూడా దక్కకపోతే రైతు పరిస్థితి ఏమిటి? భామిని, కొమరాడ, కురుపాం మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతుకు మద్దతు ధర దక్కేలా చూడాలి. దీనిపై సంయుక్త కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశాం.
– బుడితి అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



రాయ్‌పూర్‌లోని ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లో 'కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా సమస్యల విభాగం - సుపరిపాలన విధానాలపై' నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. గురు, శుక్రవారాల్లో (రెండు రోజుల పాటు) నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అస్సాం, పంజాబ్, మేఘాలయ, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి కలెక్టర్లు పాల్గొనగా.. ఆంధ్రా నుంచి పార్వతీపురం మన్యం కలెక్టర్‌కు అవకాశం దక్కడం విశేషం. పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న రక్తహీనత నివారణ కార్యక్రమంపై (ప్రిజం 10) కలెక్టర్ వివరించారు. గ్రామ స్థాయిలో రక్తహీనత నివారణ కమిటీలు ఏర్పాటు చేయడం.. రక్తహీనత గల చిన్నారులు, గర్భిణీలు, బాలింతలను దత్తత తీసుకోవడం.. సమయానుసారం రక్తహీనత బాధితులకు పౌష్టికాహారం, మందులు సరఫరా చేయడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించామని చెప్పారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం, మన బడి - మన తోట, తదితర కార్యక్రమాలపై వివరించారు.

26 నుంచి దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరాలు

పార్వతీపురం: దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాలను ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భారత ప్రభుత్వం గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (అలీమ్‌కో) ద్వారా ఉపకరణాల సరఫరా జరుగుతుందన్నారు. 80 శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం కలిగిన వారికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్లు అందజేస్తామని తెలిపారు. వీల్ చైర్, చంక కర్రలు, కాలిపర్స్, స్మార్ట్ కేన్/చేతి కర్ర, బ్రెయిలీ కిట్, స్మార్ట్ ఫోన్స్, శ్రవణ యంత్రాలు తదితర పరికరాలు అందజేస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిబిరాలకు సదరం ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు, యూడీఐడీ కార్డు జిరాక్స్‌లను తీసుకుని రావాలన్నారు.

శిబిరాలు నిర్వహించే ప్రదేశాలు

- ఈ నెల 26న సాలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణ
- 27న పాలకొండ మండల ప్రజాపరిషత్ కార్యాలయం
- 28న పార్వతీపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయం
- 29న కురుపాం మండల ప్రజాపరిషత్ కార్యాలయం

బడ్జెట్‌లో బడుగు వర్గాలకు మొండిచేయి

- బడ్జెట్‌లో గిరిజనులకు కేవలం 2.56 శాతమే కేటాయింపు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేవలం 23.43 శాతమే..
- అసెంబ్లీలో మంత్రి సంధ్యారాణి సత్యదూరపు మాటలు
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మొండిచేయి చూపిన బడ్జెట్‌ను అద్భుతం అంటూ స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అసెంబ్లీలో పేర్కొనడం విడ్డూరంగా ఉందని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనులకు రూ.6,929 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేయగా, ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం కేవలం రూ.628 కోట్లు అదనంగా కేటాయించడం విచారకరమన్నారు. జనాభా ప్రాతిపదికన చూస్తే బడ్జెట్‌లో గిరిజనులకు కేవలం 2.56 శాతం మాత్రమే కేటాయింపులు చేశారని వాపోయారు. ఎస్సీలకు రూ.18,487 కోట్లు అంటే 6.28 శాతం, బీసీలకు 39,007 కోట్లు, మైనార్టీల సంక్షేమానికి రూ.4,376 కోట్లు కేటాయింపులు చేశారన్నారు. బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన సుమారు 40 శాతం కేటాయింపులు చేయాల్సి ఉండగా కేవలం 23.43 శాతం కేటాయించారన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వృద్ధిరేటు 2023–24లో 5.81 శాతం, 2023–24లో 7.35 శాతం ఉండేదని, జాతీయ తలసరి ఆదాయం 1,84,205 కంటే రాష్ట్ర తలసరి ఆదాయం 2,42,279గా ఉండేదని వివరించారు. నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేక గత ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బంగడుపుతోందని విమర్శించారు.

మాటలు మార్చుతున్న సైకోలెవరు?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి ఆశవర్కర్లు, అంగన్‌వాడీల జీతాలు పెంచాలని, పెంచిన జీతాలు ఎప్పుడు ఇస్తారని శాసనమండలిలో ప్రశ్నించారని... నేడు ఆమె స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రిగా ఉన్న నేపథ్యంలో ఇప్పుడెందుకు వారి డిమాండ్లను పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతానికి దగ్గరగా ఏర్పాటుచేసిన గిరిజన వర్సిటీపై రోజుకో మాటమార్చుతున్న సైకోలెవరో అధికారపార్టీ నేతలే చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో కరెంట్, బస్ చార్జీలు పెంచమని హామి ఇచ్చి నేడు వాటన్నింటినీ పెంచి సంపద సృష్టి అంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పల్లె రోడ్లపై టోల్ బాదుడుకు సిద్ధపడుతుండడం విచారకరమన్నారు.

పోడుపట్టాలిచ్చినది ఎవరు?

పోడు పట్టాల పంపిణీపై మంత్రి సంధ్యారాణివి సత్యదూరపు మాటలని రాజన్నదొర విమర్శించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సుమారు 3 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వగా, చంద్రబాబు పాలన మొత్తంలో 20 వేల ఎకరాలకు మాత్రమే పోడు పట్టాలిచ్చారన్నారు. సాలూరు నియోజకవర్గంలో 14 గిరిశిఖర రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు తెచ్చేందుకు అహర్నిశలు కృషిచేసినట్టు తెలిపారు. అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను అమర్యాదగా మాట్లాడడం తెలియదని, నేడు సంధ్యారాణి మాత్రం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తుండడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, వ్యక్తిత్వమే ప్రధానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పల్లవి కిడ్నీలను తరలిస్తున్న అంబులెన్సుకు దారిచూపుతున్న నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది

అవయవదాతా.. జోహార్..

- తను మరణించి ఇద్దరికి ప్రాణదానం చేసిన చిన్నారి
- అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులకు అభినందనలు
- సేకరించిన కిడ్నీలు విశాఖకు తరలింపు
- పల్లవి మృతితో గ్రామంలో విషాదఛాయలు



చిన్నారి మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తున్న బంధువులు



కిడ్నీలను తరలిస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఎంతో ఆనందంగా జీవిస్తున్న ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. తోటి స్నేహితులతో ఆడుతూపాడుతూ, చలాకీగా ఉండే చిన్నారి... విగతజీవిగా మారుతూనే.. మరో ఇద్దరికి అవయవదానం, నేత్రదానం చేసింది. పుట్టెడు దుఃఖంలోనూ అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులను సభ్యసమాజం అభినందిస్తోంది. మరోవైపు విగతజీవిగా ఉన్న చిన్నారిని చూసిన వారంతా అయ్యో తల్లీ.. ఎంత కష్టం వచ్చిందంటూ ఆస్పత్రివద్ద కన్నీరుపెట్టారు.

గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గండి వెంకటరమణ ఈ నెల 20న భార్య దేవి, కుమార్తె పల్లవి(11)తో కలిసి బైక్‌పై ఎగువ కొండపర్తిలోని వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో బైక్ బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో భార్యాభర్తల చేతులు, కాళ్లకు గాయాలు కాగా, పల్లవి తలకు తీవ్రగాయమైంది. ఆమెను తొలుత ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, అనంతరం విజయనగరంలోని తిరుమల మెడికవర్‌కు తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు పల్లవికి బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అవయవదానానికి తల్లిదండ్రులను ఒప్పించారు. పల్లవి శరీరం నుంచి సేకరించిన రెండు కిడ్నీలలో ఒకటి విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రికి, మరొకటి కిమ్స్ ఐకాన్‌కు తరలించి రోగులకు అమర్చారు. నేత్రాలను విశాఖపట్నం ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. అవయదానం అనంతరం పల్లవి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రీన్‌ఛానల్ ద్వారా అంబులెన్సులో కిడ్నీలను తరలించే సమయంలో నర్సింగ్ విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పల్లవికి జోహార్లు పలికారు. ప్రాణదాతా.. జోహార్ అంటూ నినదించారు. చిన్నారి మృతదేహాన్ని తరలించే సమయంలో ఆస్పత్రి ప్రాంగణం వద్ద గ్రామస్తులు, బంధువులు బోరున విలపించారు.

పాపం తల్లిదండ్రులు

రోడ్డు ప్రమాదంలో పల్లవి తల్లిదండ్రులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఇద్దరు కదల్లేని స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కన్న బిడ్డను కడసారి చూసేందుకు కదల్లేని స్థితిలో అంబులెన్సులో స్ట్రెచర్‌పై మురపాక గ్రామానికి చేరుకున్నారు. విగత జీవిగా మారిన బిడ్డను చూసి కన్నీరుకార్చారు. అవయవదానానికి అంగీకరించిన పల్లవి తల్లిదండ్రుల పెద్ద మనసును తిరుమల మెడికవర్ ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ పి.ఎస్.వి.రామారావు అభినందించారు. ఇటీవల కాలంలో ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెరిగిందని తెలిపారు. వైద్యానికి సహకరించని పరిస్థితుల్లో అవయవదానం చేయడం వల్ల మరొకరికి పునర్జన్మనిచ్చినట్టు అవుతుందన్నారు.

క్లుప్తంగా

ఇండోగుల్ఫ్ క్రాప్ కంపెనీ క్లోరోఫైరిపాస్ మందు వాడొద్దు...

విజయనగరం ఫోర్ట్: ఇండోగుల్ఫ్ క్రాప్ సైన్సెస్ లిమిటెడ్ వారి బ్యాచ్‌నెం.ఎస్‌సీపీఎల్062401 ఈ గల క్లోరోఫైరిపాస్ 50 శాతం ఈసీ పురుగు మందు రీజనల్ కోడింగ్ సెంటర్ అమరావతి నందు నాసిరకం అని తేలిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురుగు మందును నిల్వ చేయడం, అమ్మడం నిషేధించారని రైతులు ఈ విషయాన్ని గమనించాలని, దీన్ని వాడరాదని సూచించారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న 71వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావుదొర, కెవి. ప్రభావతి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పురుషులు 85 కేజీలలోపు, మహిళలు 75 కేజీలలోపు బరువు మించకూడదని స్పష్టం చేశారు. ఆ రోజు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి 9949721949 నంబరును సంప్రదించాలని సూచించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి...

విజయనగరం క్రైమ్: దళిత మహిళను ప్రేమించి, వివాహం చేసుకోవడానికి నిరాకరించి, మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు విజయనగరం డీఎస్పీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంట్యాడ మండలం కిర్తిబర్తి గ్రామానికి చెందిన శినగం వెంకట సత్యం ప్రస్తుతం బాపట్ల జిల్లా స్టూవర్ట్‌పురం వద్ద రైల్వే శాఖలో పాయింట్స్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఫ్యాకల్టీగా పని చేశాడు. అదే కళాశాలలో ఫ్యాకల్టీగా పని చేసే దళిత మహిళతో పరిచయం ఏర్పరచుకుని ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. తర్వాత వివాహం చేసుకుంటానని చెప్పి ఆమెను శారీరకంగా అనుభవించాడు. సదరు మహిళ వివాహం చేసుకోమని ఒత్తిడి చేయగా కులం పేరుతో దూషించి, వివాహం చేసుకోవడానికి నిరాకరించాడని పేర్కొన్నారు. దీంతో ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై గంట్యాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసారని తెలిపారు. కేసు నమోదు చేసినప్పటి నుంచి సదరు నిందితుడు పరారీలో ఉండగా, గురువారం అందిన సమాచారంతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

చివరిలో తెగుళ్ల దాడి

- వరి పంటకు ఆశించిన రెల్లరాల్చు పురుగు
- వరి కంకులను విరిచేస్తున్న వైనం
- ఆందోళనలో రైతులు
- 1121, సోనామసూరి రకాలకు ఆశించిన పురుగు


గంట్యాడ మండలం పెదవేమలిలో పురుగు ఆశించడం వల్ల దెబ్బతిన్న సోనామసూరి రకం వరి పంట


విజయనగరం మండలం పినవేమలిలో రెల్లరాల్చు పురుగు ఆశించడం వల్ల దెబ్బతిన్న 1121 రకం వరి


పెదవేమలిలో పురుగు ఆశించడంతో దెబ్బతిన్న వరి పంటను చూపిస్తున్న రైతు


రెల్ల రాల్చు పురుగు

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ వరి పంట చివర దశకు వచ్చేసింది. సీజన్‌లో వర్షాలు అనుకూలించి ప్రకృతి సహకరించిన ప్రాంతాల్లో ఇప్పటికే కోతలు కూడా ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల మరో వారం, పది రోజుల్లో పంట చేతికంది వస్తుందన్న దశలో వరి పంటకు పురుగు ఆశించడంతో దిగుబడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కంకులను పురుగు విరిచేస్తుండడంతో దిగుబడి పడిపోతుందని అన్నదాత దిగులు పడుతున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏమి చేయాలో తోచడం లేదు.

1121, సోనామసూరిలకు ఆశించిన పురుగు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట 97 వేల హెక్టార్లలో సాగైంది. వీటిలో ఎక్కువగా రైతులు 1121 వరి రకాన్ని సాగు చేసారు. 80 వేల హెక్టార్ల వరకు 1121 రకం సాగవ్వగా మిగిలిన పొలంలో సోనామసూరి, సాంబమసూరి, స్వర్ణ తదితర రకాలను రైతులు సాగు చేసారు. వరి పంటకు ప్రస్తుతం రెల్లరాల్చు పురుగు ఆశించింది. ఈ పురుగు వరి పంట కంకులను విరిచేయడంతో ధాన్యం నేలపాలవుతున్నాయి.

దిగుబడిపై ఆందోళన

పంట చివరి దశలో రెల్ల రాల్చు పురుగు ఆశించడంతో కంకులు విరిగిపోతున్నాయి. దీని వల్ల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ధాన్యం దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది పంటను బట్టి ఎకరానికి 26 నుంచి 28 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు భావించారు. అయితే పురుగు ఆశించడం వల్ల ఎకరానికి 15 నుంచి 18 బస్తాలకు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పురుగు మందు పిచికారీ చేయడానికి వీల్లేని పరిస్థితి

వరి పంటకు వాశించిన పురుగు నివారణకు పురుగు మందు పిచికారీ చేయడానికి వీల్లేని పరిస్థితి. రెల్ల రాల్చు పురుగు నివారణకు పురుగు మందు పిచికారీ చేయాలంటే వరి కోతకు 10, 15 రోజులు సమయం ఉండాలి. కానీ జిల్లాలో చాలా చోట్ల వరి కోతలు కోయడానికి నాలుగైదు రోజులు సమయం మాత్రమే ఉంది. దీంతో పురుగు మందు పిచికారీ చేయడానికి వీలు కాని పరిస్థితి నెలకొంది.

క్షేత్ర స్థాయిలో పర్యటించని వ్యవసాయ సిబ్బంది

వ్యవసాయ సిబ్బంది రైతుల పొలాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పడం తప్పితే క్షేత్ర స్థాయిలో రైతులకు ఏ మేలు జరగడం లేదని చెబుతున్నారు. రెల్లరాల్చు పురుగు ఆశించడం వల్ల వరి కంకులు విరిగిపోయి రైతులకు నష్టం వాటిల్లుతున్నా వ్యవసాయ అధికారులు సూచనలు అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురుగు ఆశించింది..

జిల్లాలో రెల్లరాల్చు పురుగు వరి పంటకు ఆశించిన మాట వాస్తవమే. రెల్లరాల్చు పురుగు ఆశించినట్టయితే క్లోరోఫైరిపాస్ మందు ఎకరానికి 500 ఎం.ఎల్ సాయంత్రం పూట వరి పంట బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. వ్యవసాయ అధికారులు, సిబ్బందిని పొలాల్లో పర్యటించి పురుగు నివారణ చర్యలు గురించి తెలియజేయాలని ఆదేశించాం.

– వి.తారకరామరావు, జిల్లా వ్యవసాయ అధికారి

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

- కార్మిక, రైతు సంఘాల నేతలు


కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్రం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌పీఆర్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అయినా తమ విధానాల్లో మార్పు లేదన్నారు. కుక్కతోక ఒంకరని మరోసారి మోదీ ప్రభుత్వం రుజువు చేసుకుందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం, జనసేన ప్రభుత్వాలు రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సర్వసంపదలు సృష్టించేది కార్మికవర్గం, ప్రజలకు తిండిపెట్టేది రైతాంగమని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కేవలం కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలంగా గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచి పెట్టిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. వ్యవసాయ దేశమైన భారతదేశంలో కార్మిక వర్గం, రైతాంగంతో కలిసి ఐక్యంగా పోరాడితేనే మన లక్ష్యం సాధించగలమన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని చీల్చాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం ప్రయత్నిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ 26న కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాలో కార్మికులు, రైతులు, ప్రజా సంఘాలు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, కార్యదర్శి ఎ.జగన్‌మోహన్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఇఫ్టూ నాయకులు కె.అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ


సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం కనుల పండువగా సాగింది. కార్తీక శుక్రవారం సందర్భంగా సాయంత్రం స్వామివారి ఆస్థాన కల్యాణ మండపంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ముందుగా స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేపట్టారు. అనంతరం వేద మంత్రోచ్చారణ నడుమ కల్యాణ మండపంలో ఉన్న ప్రత్యేక ఊయల్లో స్వామివారిని వేంచింపజేసి ఊంజల్ సేవను అత్యంత వైభవంగా జరిపించారు. భక్తులే స్వయంగా స్వామివారికి దీపాలంకరణ సేవ చేసే భాగ్యం కలగడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. అనంతరం అర్చకస్వాములు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి : పీఓ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆకాంక్షించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి నేపథ్యంలో జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు జరిగాయి. అందులో భాగంగా వాలీబాల్, జావలింగ్ త్రో, ఆర్చరీలలో విజేతలుగా ఎంపికైన 28 మంది విజేతలకు శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద పీఓ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది పతకాలతో తిరిగిరావాలని ఆశీర్వదించారు. 24న జరగబోయే రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలకు 33 మంది విద్యార్థినులు, 22 మంది గిరిజన కళాకారుల బృందం పాల్గొంటున్నట్లు తెలిపారు. 25న రాష్ట్ర స్థాయిలో జరగనున్న వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో 9 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

మూడు నెలల వరకు పింఛన్ బకాయి చెల్లింపు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద మూడు నెలల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ఆయన నిర్వహించారు. పింఛను పంపిణీ వ్యవధిలో అందుబాటులో లేనివారు, పింఛను తీసుకోని పింఛనుదారులకు మూడు నెలల వరకు పింఛను బకాయిలు చెల్లించడం జరుగుతుందన్నారు. బకాయిల చెల్లింపు 2024 నవంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి విడుదల అవుతుందని ఆయన వివరించారు. పింఛనుదారు ఏదైనా కారణం చేత పింఛను తీసుకోకపోతే, అది తాత్కాలిక వలసగా పరిగణించడం జరుగుతుందని చెప్పారు. ఎవరైనా పింఛనుదారు ఒక నెలలో పింఛను (తాత్కాలిక వలస) తీసుకోకపోతే, ఒక నెల బకాయితో పాటు రెండవ నెల పింఛను విడుదల చేయడం జరుగుతుందని, పింఛనుదారులు రెండవ నెలలో కూడా పింఛను తీసుకోని పక్షంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద పింఛనుదారులకు సౌకర్యాలు కల్పించేందుకు రెండు నెలల బకాయిలతో పాటు మూడవ నెల పింఛను కూడా విడుదల చేయనున్నట్లు ఆయన వివరించారు. పింఛనుదారులు మూడు నెలలు వరుసగా పింఛను తీసుకోకపోతే శాశ్వత వలసగా పరిగణించి వారి పింఛను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత నిబంధనలపై పింఛనుదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పింఛను పంపిణీని పర్యవేక్షించాలని అన్నారు.

మంత్రి సవిత రాజీనామా చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కళావతి


మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఏపీ శాసనమండలిలో రాష్ట్ర మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి సవిత తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేసారు. శుక్రవారం ఆమె వండువలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీబీటీ డబ్బుల ద్వారా మహిళలు గంజాయి, మద్యానికి బానిసలు అయ్యారని మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలపై కళావతి మండిపడ్డారు. వెంటనే మంత్రి సవిత రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. ఒక మహిళా మంత్రిగా ఉండి రాష్ట్ర మహిళల పట్ల ఇంత నీచంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. మంత్రి సవిత శాసన మండలిలో రాష్ట్ర మహిళల పట్ల చాలా దుర్మార్గంగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటువంటి వారికి చట్టసభలకు వెళ్లే అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు... ఈ హామీ ఎప్పుడు నెరవేరుస్తారని కళావతి ప్రశ్నించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారం వచ్చిన తర్వాత ఈ హామీకి తూట్లు పొడుస్తూ ఈ ఏడాది ఒక్క గ్యాస్ సిలెండర్ ఇచ్చి రెండు సిలెండర్లను బొక్కేసారని ఆవేదన వ్యక్తం చేసారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిసారీ గత ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకుని ఇటువంటి సభలను పక్కదోవ పట్టిస్తున్నారని కళావతి ఆవేదన వ్యక్తం చేసారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్.. తప్పిన ప్రమాదం


ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ మున్నా

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ నుంచి రేగులపాడు గ్రామానికి శుక్రవారం మొక్కజొన్న తొక్కును ట్రాక్టర్‌తో తీసుకువెళ్తున్న డ్రైవర్ మున్నాకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. సరిగ్గా వీరఘట్టం పట్టణంలోని తెలగవీధి మలుపు నుంచి ప్రధాన రహదారిపైకి ట్రాక్టర్‌ను ఎక్కిస్తుండగా ఫిట్స్ వచ్చింది. దీంతో ఒక్కసారిగా ట్రాక్టర్ ముందు భాగం పైకి లేవడంతో ట్రాక్టర్ తొట్టిలో మొక్కజొన్న తొక్కుపై ఉన్న నలుగురు మహిళలు భయంతో కేకలు వేశారు. ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడబోతుండగా సమీపంలో ఉన్న కొందరు ఆటో డ్రైవర్లు, వ్యాన్ డ్రైవర్లు వెంటనే ట్రాక్టర్‌పైకి ఎక్కి ఇంజన్‌ను అదుపు చేశారు. ట్రాక్టర్‌ను రోడ్డుపైకి తీసుకువచ్చారు. సీటులో ఫిట్స్ వచ్చి కాలు, చేతులు కొట్టుకుంటున్న డ్రైవర్ మున్నాను కిందకు దించి సపర్యలు చేసారు. దీంతో కొద్ది సేపటికి డ్రైవర్ సాధారణ స్థితికి వచ్చి ఆరోగ్యం కుదుటపడింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు వాడొద్దు..

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణి


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే ఎటువంటి మందులు వేసుకోరాదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి సూచించారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీ అవగాహన ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ సూచన మేరకు అవసరమైనన్ని రోజులు మందులు వాడాలన్నారు. మందులు ఎక్కువ వాడితే అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంఓ మణి, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ అర్చనదేవి, ఎపిడిమాలజిస్టు వెంకటేష్ , డెమో చిన్నతల్లి పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్ మందులు అతిగా వాడరాదు

యాంటీ బయాటిక్ మందులు అతిగా వాడరాదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద శుక్రవారం ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, మైక్రో బయాలజి హెచ్‌ఓడీ డాక్టర్ బి.అరుణశ్రీ, అసోసియేట్ ప్రొఫెసర్ పార్వతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్య తదితరలు పాల్గొన్నారు.

గుజ్జింగివలసలో అగ్ని ప్రమాదం

- రూ.10లక్షల ఆస్తి నష్టం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన నగదు


పెంకిటిల్లులో నుంచి వస్తున్న పొగలు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కె.విశ్వేశ్వరరావు పెంకిటిల్లు పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో సుమారుగా నగదు రూ.4లక్షలు, ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ మొత్తం రూ.పది లక్షల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. కష్టపడి సంపాదించిన నగదు మొత్తం కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంఘటన స్థలానికి అగ్ని మాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపు చేశారు.

సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీఎంఆర్ విద్యార్థులు


ఎస్.సాయిసుధీర్


పి.మహేంద్రరావు


వి.నిహారిక


పి.దీపిక


ఎన్.రుచిత


వి.శరత్

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్ వీఆర్ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన ఎంపికలో సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగానికి సంబంధించి 105 కేజీల విభాగంలో పి.మహేంద్రరావు, 120 కేజీల విభాగంలో ఎస్.సాయిసుధీర్, 52 కేజీల విభాగంలో వి.నిహారిక, 72 కేజీల విభాగంలో పి.దీపిక, 63 కేజీల కేటగిరీలో ఎన్.రుచితలు ఎంపికయ్యారని అన్నారు. అలాగే జూనియర్ విభాగానికి సంబంధించి 59 కేజీల కేటగిరీలో వి.శరత్ ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా ఈ నెల 24 నుంచి 27 వరకు తమిళనాడు రాష్ట్రం సలేం డివిజన్ డీఆర్ఎం ఆఫీస్ రైల్వే క్వార్టర్స్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, పీడీ బి.అరుణ్‌కుమార్, విద్యార్థులు అభినందించారు.